క్లుప్తంగా

12న కళావేదిక వార్షికోత్సవం

ఎంవీపీ కాలనీ: కళా వేదిక సంస్థ 30వ వార్షికోత్సవాన్ని ఈ నెల 12న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు నండూరి రామకృష్ణ తెలిపారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో ఉదయం ఈ వేడుకలు నిర్వహించనున్నామన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేయనున్నట్లు తెలిపారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ



ప్రజా రక్షణ భేరి పోస్టర్లతో సీపీఎం నాయకులు

ఆరిలోవ: ఈ నెల 15న విజయవాడలో జరగనున్న ప్రజా రక్షణ భేరి పోస్టర్‌ను సీపీఎం ఆరిలోవ జోన్ నాయకులు మంగళవారం ఆ పార్టీ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ భేరికి ఆరిలోవ ప్రజలు తరలి రావాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు కుమార్, శంకరరావు, సూర్యమణి, రంగమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కారు బీభత్సం

సీతమ్మధార : మద్యం సేవించి కారుతో బీభత్సం సృష్టించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రాంతానికి చెందిన విశ్వనాథ్ శేఖర్ కారులో మంగళవారం రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో తాటిచెట్లపాలెం జంక్షన్‌లో ఇద్దరు ద్విచక్రవాహనదారులను, ఓ కారును ఢీకొట్టాడు. ఈ ఘటనలో హరిబాబు, కృష్ణ తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వీరిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆకాశ దీపారాధనకు ఏర్పాట్లు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీ నుంచి ఆకాశ దీపారాధన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలు డిసెంబరు 12వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఆకాశ దీపారాధనలో పాల్గొనాల్సిన భక్తులు వారి గోత్ర నామాలతో పూజలు చేయడానికి రూ.200లు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆలయ బ్యాంకు అకౌంటు, ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా చెల్లించాలన్నారు.

గంజాయి నిందితుడికి రిమాండ్

సీతమ్మధార: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఫోర్తుటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేరళకు చెందిన అబ్దుల్ సలాం అల్లూరి జిల్లా అరకు నుంచి మధ్యవర్తి ద్వారా కేరళకు గంజాయితో విశాఖలోని రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ ఎస్.విజయకుమార్ తన సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు చెప్పడంతో సలాం నుంచి రెండు కిలోలు గంజాయితో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: నటరత్న కల్చరల్ అసోసియేషన్, శారద స్వర సంగమం సంయుక్త నిర్వహణలో మంగళవారం సాయంత్రం పౌరగ్రంథాలయంలో నిర్వహించిన తెలుగు, హిందీ గీతాల కార్యక్రమం అలరించింది. సంస్థ వ్యవస్థాపకులు భయ్యాశ్రీనివాస్, లోకేష్ నిర్వహణలో నగరానికి చెందిన గాయకులు హుషారైన గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో గాయనీగాయకులు మాధురి, గీతా,పద్మిని, కవిత, స్వరూప, శ్రీదేవి, లక్ష్మీసాత్విక, అమ్మాజి, నాగు,శ్రీనివాసరావు, రాంబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా 'ఆరోగ్య సురక్ష'



శ్రీకృష్ణాపురం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

- 'తూర్పు'లో ముగిసిన ప్రత్యేక శిబిరాలు
- మొత్తం 16,679 మందికి వైద్య పరీక్షలు

ఆరిలోవ: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు తూర్పు నియోజకవర్గంలో మంగళవారం ముగిశాయి. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత నెలలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాల్లో వైద్య నిపుణులు వేలాది మంది ప్రజలకు వైద్య సేవలు అందించి భరోసా కల్పించారు. శిబిరానికి వచ్చే రోగుల కోసం ఓపీ, మందుల కౌంటర్, కన్సెల్టెన్సీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ముందుగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సర్వే చేయడం తెలిసిందే. ఇంటింటి సర్వే అనంతరం ప్రతి యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సచివాలయాలు వారీగా నిర్వహించారు. తూర్పు నియోజకవర్గంలో ఈ శిబిరాలు గత నెల 2న ప్రారంభమయ్యాయి. మంగళవారం జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంతో ముగిశాయి. ఈ శిబిరంలో రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్ ప్రాంతాల ప్రజలు వైద్య సేవలు పొందారు. రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా వైద్య పరీక్షలు చేశారు.

ఇవీ ఇక్కడ సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో రోగులకు బీపీ, మధుమేహం, టీబీ, గైనిక్ తదితర వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో రోజూ ఐదుగురు స్పెషలిస్టులు, 12 మంది ఏఎన్ఎంలు, 17 మంది ఆశా వర్కర్లు, 8 మంది సహాయక ఇబ్బంది సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మలేరియా, టీబీ మందులతో పాటు, అంగన్‌వాడీలో పిల్లలకు పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాలు ప్రదర్శించారు. చెంతనే వైద్యం అందడంతో ప్రజలు ఈ శిబిరాల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

8 యూపీహెచ్‌సీలు.. 16,679 మందికి సేవలు



జనరల్ విభాగం ఓపీ వద్ద క్యూ

తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ జోన్ 2, 3 పరిధిలో ఉంది. వీటి పరిధిలో 8 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. వాటిలో 57 సచివాలయాలకు సంబంధించిన ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో వైద్య సేవలు ఉచితంగా అందించారు. జోన్–2 పరిధి శ్రీకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ(తోటగరువు యూపీహెచ్‌సీ), బాలాజీనగర్, వివేకానందనగర్(ఎంఎస్ఆర్ లేఅవుట్ యూపీహెచ్‌సీ)లో 4 యూపీహెచ్‌సీలు, జోన్–3 పరిధి ఇసుకతోట, వెంకోజీపాలెం, పిఠాపురం కాలనీ, పెదవాల్తేరులో 4 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. వాటి పరిధిలోని 16,679 మంది వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ పథకం కింద 366 మందిని వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.

దగ్గరలోనే వైద్య సేవలు అందడం బాగుంది..



నాది పైనాపిల్ కాలనీ. వయస్సు 90 సంవత్సరాలు. కొన్నాళ్లుగా నడవలేకపోతున్నాను. దూరంలో ఉన్న ఆస్పత్రులకు వెళ్లలేక ఇంటి వద్దే ఉండిపోయాను. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం దగ్గరలో జరుగుతుందని తెలిసి నా కోడలు, మనవరాలు సహాయంతో వచ్చి డాక్టర్‌కు నా పరిస్థితిని వివరించాను. మందులు ఇచ్చారు. నా ఆరోగ్యం గురించి చాలా బాగా అన్నీ అడిగి తెలుసుకొని మందులు ఇచ్చారు. దగ్గరకు వచ్చి వైద్యం అందించడం సంతోషంగా ఉంది.

– దొమ్మేటి నారాయణమ్మ, పైనాపిల్ కాలనీ

డోర్ డెలివరీ అభివృద్ధి చేయాలి



కార్గో, పార్సిల్ పాయింట్‌ను సందర్శించి సూచన చేస్తున్న రాజారెడ్డి

దాబాగార్డెన్స్: ఆర్టీసీ కార్గో డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎ.రాజారెడ్డి, జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ మంగళవారం ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్‌ని సందర్శించారు. పార్సిల్ పాయింట్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డోర్ డెలివరీపై ఆరా తీశారు. ముఖ్యంగా డోర్ డెలివరీని అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం ప్రజా రవాణా అధికారి అప్పలరాజు చాంబర్లో పలువురు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఏపీఎస్ఆర్టీసీ ఉన్నతికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీటీవో ఎ. అప్పలరాజు, డీసీటీఎంలు బి. అప్పలనాయుడు, సత్యనారాయణ, ఏటీఎం కణితి వెంకట్రావు, డిపో మేనేజర్ రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మద్రిపాలెం: అతివేగం, నిర్లక్ష్యం కారణంగా జరిగిన ప్రమాదాలపై కంచరపాలెం పోలీసులు అవగాహన కల్పించారు. ఊర్వశి జంక్షన్‌లో మంగళవారం ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో యువతకు సుప్ర వాహనం ద్వారా గతంలో జరిగిన ప్రమాదాలను ప్రదర్శిస్తూ ,ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే గతంలో జరిగిన ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయి, గాయపడిన వారు వీడియోలను చూపిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, అలాగే హెల్మెట్ లేకుండా ప్రయాణాలు సాగించవద్దని సూచించారు. కార్యక్రమం కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఎస్ఐలు పాపారావు, వాసుదేవరావు, ఉల్‌హక్ పాల్గొన్నారు.

సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



విజేతకు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ

మురళీనగర్: భారత్ రత్న, నోబెల్ బహుమతి గ్రహీత సీవీ రామన్ నేటి యువతకు ఆదర్శంగా తీసుకోవాలని కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. సీవీ రామన్ జయంతిని కాలేజీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోనే చదువుకుని ఇక్కడే పరిశోధనలు చేసి రామన్ ఎఫెక్ట్‌ను ఆవిష్కరించి నోబుల్ పురస్కారాన్ని అందుకున్న ఏకైక భారతీయ శాస్త్రవేత్తగా అయన గుర్తింపు పొందారని చెప్పారు. రామన్‌కు మొదట్లో శబ్దశాస్త్రం పట్ల ఆసక్తి ఉండేదని అనంతరం ఆయన కాంతిపై పరిశోధనలు చేశారని వివరించారు. రామన్ ఎఫెక్ట్ కనిపెట్టడానికి ఆయనకు కేవలం రూ.250లు మాత్రమే ఖర్చు అయ్యిందని చెప్పారు. పరిశోధనలు చేయాలనుకుంటే అధునాతన సౌకర్యాలు అవసరం లేదని క్రియేటివిటీ ఉంటే అందుబాటులో ఉన్న వనరులతోనే నూతన ఆవిష్కరణలు చేయవచ్చని రామన్ నిరూపించినట్లు అయన పేర్కొన్నారు. విద్యార్థులు పరిశోధన రంగంవైపు వెళ్లేందుకు రామన్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. విశాఖతో ఆయనకు అనుబంధం ఉందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఆయన సూచించారు. ముందుగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలు డి.బేబీ శృతిక, కె.సాయి ప్రణతిలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సీహెచ్. జయప్రకాష్ రెడ్డి, ఎస్.ప్రశాంతి కుమారి, డి.దామోదర్, స్టూడెంట్ అడ్వయిజర్ బి.రామాంజనేయులు, అధ్యాపకులు జ్యోతి, ప్రదీప్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనధికారిక దత్తత నేరం



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జడ్జి శేషమ్మ

మద్రిపాలెం: చిన్నారుల అనధికారిక దత్తత చట్టపరంగా నేరమని డీఎల్ఎస్ఏ జడ్జి శేషమ్మ అన్నారు. అంతర్జాతీయ దత్తత మాసం సందర్భంగా మద్రిపాలెంలోని శిశుగృహను ఆమె మంగళవారం సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న చిన్నారుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. అలాగే వారికి అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం దత్తత తీసుకున్న తల్లిదండ్రులతో కాసేపు మాట్లాడారు. ఎవరైనా దత్తత తీసుకోవాలనుకునే వారు చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అంతకముందు బాలింతలతో సమావేశం నిర్వహించిన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ వెంకటేశ్వరి, సీడీపీవో రమణకుమారి, సీడబ్ల్యూ మెంబర్ లక్ష్మి, డీసీపీ రమేష్, పీవోఎస్ఐసీ మమత, శిశుగృహ మేనేజర్ సుజాత, రామలక్ష్మి పాల్గొన్నారు.

మహిళల వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ జట్లతో కృష్ణా కళాశాల అధ్యాపకులు

మద్దిలపాలెం: ఏయూ ఇంటర్ కళాశాలల మహిళల వాలీబాల్ పోటీలు మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.విజయమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూ పరిధిలో 9 కళాశాలల నుంచి 100 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో తలపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి పల్లవి, వీఎస్ కృష్ణా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, కళాశాల పీడీ సంధ్యారాణి పాల్గొన్నారు.

మహిళలకు ఆశ్రయం



ఆశ్రయం పొందిన మహిళలతో ప్రగడ వాసు తదితరులు

అల్లిపురం : నగరంలో వివిధ ప్రాంతాల్లో ఒంటరిగా తిరుగుతున్న మహిళలకు ఏయూటీడీ సిబ్బంది కల్పించారు. అటువంటి వారికి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల మహిళల షెల్టర్‌లో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. అదిలాబాద్‌కు చెందిన పూజ (55), ఒడిశాకు చెందిన శాంతి (25), పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఫాతిమాను రైల్వేస్టేషన్, కంచరపాలెం, కేజీహెచ్ దగ్గర గుర్తించి పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహకారంతో ఆశ్రయం కల్పించామన్నారు. వారిని పూణే కేంద్రంగా పని చేస్తున్న శ్రద్ధా ఫౌండేషన్‌కు అప్పగించినట్లు వాసు తెలిపారు. త్వరలోనే వారిని వాళ్ల కుటుంబాలకు అప్పగించనున్నట్లు శ్రద్ధా ప్రతినిధి రమాకాంత్ తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. దేవస్థానంలో ఈ నెల 9న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి ఈ పూజలో పాల్గొనవచ్చన్నారు.

సరైన చర్యలతోనే మాతాశిశు మరణాలు తగ్గుదల



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, చిత్రంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

మహారాణిపేట: మాతాశిశు మరణాల రేటు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, దీనిపై అందరిలో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శిశు సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. మాతాశిశు మరణాలను తగ్గించడానికి ప్రతి ఏడాది నవంబర్ 7న శిశు సంరక్షణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. నవజాత శిశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంపొందించి శిశు మరణాల రేటు తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. డిస్ట్రిక్ట్ సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ మాట్లాడుతూ గైనిక్ విభాగంలో లేబర్ రూమ్‌లో బయో మెడికల్ వేస్ట్ గురించి ఆస్పత్రుల నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ ఎంఎస్ రాజు మాట్లాడుతూ చిన్నారులకు వచ్చే వ్యాధులను తల్లి గుర్తించి వైద్యం చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ గైనకాలజిస్టు డాక్టర్ షర్మిల, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకటేశ్వరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, కేజీహెచ్ పిల్లల డాక్టర్ పి.చక్రవర్తి, డాక్టర్ శరణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐ.మనోరమ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో బాణసంచా రవాణా నిషేధం



విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున సివిల్ డిఫెన్స్ సభ్యులు

తాటిచెట్లపాలెం: దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌లో ప్రత్యేక డ్రైవ్‌లకు శ్రీకారం చుట్టింది. రైళ్లలో దీపావళి సామగ్రి తరలించకూడదని, మండే స్వభావం గల పదార్థాలు తరలించకూడదని విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగాలో రైళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రత్యేక స్క్వాడ్‌ను నియమించింది. డివిజన్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లలో రైల్వే అధికారులు, సివిల్ డిఫెన్స్ సభ్యులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ప్రయాణికుల బ్యాగులను, లగేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు వీటిపై అనౌన్స్‌మెంట్స్ ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా రైళ్లలో, రైల్వే స్టేషన్‌లలో టపాసులు, మండే ప్రమాదకర పదార్థాలు రవాణా చేస్తున్నట్లు గమనిస్తే వెంటనే రైల్వే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

ఘనంగా ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం



సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ సిన్హాకు కేక్ తినిపిస్తున్న అధికారులు

పరవాడ: ఎన్టీపీసీ 49వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సింహాద్రి ఎన్టీపీసీ పరిపాలన భవనంలో ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ఎండీ గురుదీప్‌సింగ్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. సంస్థ ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నారని అభినందించారు. అనంతరం సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ 48 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో 73,874 ఎండబ్ల్యూ సాధించిందని వివరించారు. రానున్న సంవత్సరంలో నిర్దేశించిన మైలురాళ్లను చేరుకోవడానికి కొత్త శక్తితో కష్టపడి పనిచేయాలని కోరారు. సింహాద్రి ఎన్టీపీసీ వివిధ రంగాల్లో సాధించిన అవార్డులు, ప్రశంసలను వివరించారు. వేడుకల్లో భాగంగా హిందీ పక్వాడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు ఎస్.గోవిందరాజన్, అంజూ సిన్హా, హెచ్ఆర్ హెడ్ రుమా డీ శర్మ, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వి.కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో సౌర వెలుగులు

- రూ. 50 లక్షలతో 120 కె.వి. ప్లాంట్ నిర్మాణం
- నేడు ప్రారంభం



సోలార్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేజీహెచ్ అధికారులు



కేజీహెచ్ ఓపీలో ప్రారంభానికి సిద్ధమైన సిమెంటు బెంచీలు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పేదలకు వైద్య సేవలందిస్తున్న కింగ్ జార్జి ఆస్పత్రిలో సౌర (సోలార్) విద్యుత్ పనులు పూర్తి చేశారు. ఈ ప్రాజెక్టును ఏఆర్ మిట్టల్ సంస్థ సీఎస్ఆర్ కింద రూపొందించింది. బుధవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున దీనిని ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల కేజీహెచ్‌లో విద్యుత్ ఆదా అవుతుందని, ఈ సోలార్ వెలుగులను సీఎస్ఆర్ బ్లాక్‌లో ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. పది శాశ్వత సిమ్మెంటు బెంచీలను కూడా కలెక్టర్ ప్రారంభించనున్నారు. వీటిని ఓపీ బ్లాక్‌లో ఏర్పాటు చేశారు. వీటికి లయన్స్ క్లబ్ సహాయం చేసింది.

కళ తప్పిన 'వాల్ డెకరేషన్'



కళావిహీనంగా ఎంవీపీ కాలనీ- ఉషోదయ రోడ్డులో వాల్ డెకరేషన్



లాసన్స్ బే కాలనీ సచివాలయం ఎదుట వాల్ డెకరేషన్ పరిస్థితి ఇలా..

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలో ఏర్పాటు చేసిన వాల్ డెకరేషన్ నిర్వహణను జీవీఎంసీ గాలికొదిలేసింది. సందర్శకులను, వాహనదారులను విశేషంగా ఆకర్షించే విధంగా గత జులైలో ఎంవీపీ కాలనీలోని పలు చోట్ల జీవీఎంసీ ఈ వాల్ డెకరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఏట్ ఎంవీపీ కాలనీ పేరుతో వివిధ రకాల ఇండోర్ ప్లాంట్స్‌తో కూడిన వాల్‌ను ఏర్పాటు చేశారు. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా సర్కిల్ నుంచి ఉషోదయ కూడలి వైపు వెళ్లే రోడ్డులో కల్వర్ట్‌పైనా, లాసన్స్ బే కాలనీ సచివాలయం సమీపంలోని బీచ్‌రోడ్డు మార్గంలో వీటిని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతను జోన్–3 టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు బ్యూటిఫికేషన్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఆరు నెలలకే కళావిహీనంగా తయారయ్యాయి. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఈ వాల్ నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యత చేపట్టి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన ఖోఖో శిక్షణ శిబిరం



రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్న ఖోఖో జట్లతో కోచింగ్ క్యాంప్ నిర్వాహకులు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనున్న జట్లకు శిక్షణ శిబిరం ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా ఖోఖో అండర్–14 (బాలురు, బాలికల) జట్లకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు కోచింగ్ క్యాంప్ నిర్వహించి, ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు పర్యవేక్షణలో పీడీలు లక్ష్మీరాణి, శ్యామ్, వీరు నాయుడు ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులు వారం రోజుల పాటు సుశిక్షితులైన వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ పొంది, ఆటలో మెలకువలు నేర్చుకుని, ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు చిత్తూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధులు కావడం సంతోషంగా ఉందన్నారు. పోటీలో సత్తా చాటి ఉమ్మడి విశాఖ జిల్లాలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.